# పుణ్యం

కరుణాకరంగాడికి నేనంటే జలసీ, మా ఫాదరు తెలివైన వాడూ, గడుసు వాడూను. కాబట్టి ఏదో ఇంత గడించి పారేశాడు అదేదో నేను తింటున్నాను. అది నా అదృష్టం. నాకూ బాగా పలుకుబడి, తెలివితేటలూ ఉంటే ఉన్నాయనుకోండి. లేకపోతే లేవనుకోండి. ఉన్నాలేకపోయినా నా ప్రాక్టీసు బావుంది. వాడికి బాగులేదు. అందుకు నేనేం చెయ్యను? కాని వాడికి నేనంటే జెలసీ, వాడు మంచి పడ్డూ పొడుగూ వున్నాడు. ఉండొద్దన్నానా? వాడు అందంగా వుంటాడంటూరు, కొంతమంది. వుంటే వుండవచ్చు. వాడికి పాతికే వయసట. నా కంటే రెండేళ్ళు చిన్నట. వప్పుకున్నాను. "వీడు నా కంటే చిన్న వెధవ, అయినా నా కంటే పొడుగ్గా ఉండడమేం?" అని చెప్పి వాడంటే నేనేమైనా ఈర్ష్య చూపించేనా? అసూయ పడ్డానా? లేదే. కాని వాడికే నేనంటే యెందుకో అంత జెలసీ. "ఒరే రాస్కెల్" అంటే "ఒరే రాస్కెల్" అనుకొంటూ ఇద్దరం పైకి మళ్ళీ మంచిగానే ఉంటాం. లోలోపలే కుళ్ళంతాను. నేనేమీ వాణ్నేం అనను. సూటిపోటీగా వాడే నన్నేదో అప్పుడప్పుడు అంటూవుంటాడు. నేను కూడా దానికి తగ్గట్టు వాటికి అంటించేస్తూ వుంటాను.

ఇవాళ మధ్యాహ్నం, రెండు గంటలయింది. శీతకాలమే అయినప్పటికీ తెలుసుకదా ఎండ జోరుగా ఉంది. కోర్టుహాల్లో గాల్లేక ఉడకబెడుతూంటే నేనూ, పెద్దాయనా, కరుణాకరంగాడూ బైట వరండాలోకి వచ్చేం.

"పాపం పెరిగిపోతోందండీ. ఎండలందుకే ఎలా మండిపోతున్నాయో చూసేరా?" అన్నాడు పెద్దాయన.

అతగాడికి పూటకి టికాణాలేదు. దమ్మిడీ ప్రాక్టీసులేదు. వాడికి లోకంలో పాపం తప్ప మరేం కనిపిస్తుంది? అలాటి కామెర్ల రోగుల్ని చూస్తే నా కసహ్యం.

"అమెరికాలో డెమాక్రేట్లు పవర్లోకొచ్చేరు, అందుకే ఎండ ఇలా ఉంది. జపాన్లో సోషలిస్టులు పవర్లోకి రాలేదు. అందుకే ఎండ ఇలా ఉంది. పాపం పెరగడానికి ఎండలు మండిపోవడానికి అంత సంబంధం ఉంది. మీకు వెర్రేమిటి గురువుగారూ?! పాపం అంటూ పదార్థం వేరే ఒకటుందేమిటి? పాపంలేదు, పుణ్యంలేదు" అని నే నన్నాను.

"పాప పుణ్యాల తేడా లేదుకాబట్టే లోకం ఇలా వుంది" అన్నాడు పెద్దాయన.

"లేవు. లోకంలో పాపపుణ్యాలు లేవు. లాభనష్టాలే ఉన్నాయి" అని నేను మళ్ళీ అన్నాను.

"ఎండకీ, పాపానికీ సంబంధం లేదనుకో, కాని లోకంలో పుణ్యాత్ములే లేరంటావా అయితే?" అంటూ కరుణాకరంగాడు రంగంలోకి దిగేడు. ప్రతి చిన్న విషయంలోనూ నన్ను దెబ్బతీయాలనే వాడి ఉద్దేశం.

"లోకంలో మనుషులున్నారు. పుణ్యాత్ములంటూ ఎవరూ లేరు. వుంటే చూపించు. ఫోటోతీసి ఫ్రేంకట్టిస్తాను" అని వెక్కిరింతగా వాడికి కోపం వచ్చేలా తాజాగా సమాధానం చెప్పేను.

"నువ్వు సినికల్ స్కాండ్రల్‌వి" అని సరదాగా అన్నట్టుగా వాడన్నాడు.

"నిన్ను చూసుకొని నువ్వే బెదురుతున్నావు. పైకి వప్పుకోంగాని, నిజానికి అందరం అంతే. నీ లాభంకోసం నువ్వోపని చేస్తావు. దానివల్ల నాకపకారం జరిగితే నువ్వు పాపిష్టి వెధవ్వంటాను. అంతేకదా?" అన్నాను.

"మంచితనంమీద నమ్మకంలేని వెధవ్వి" అని వాడు నన్నన్నాడు.

"మంచితనం మీద నమ్మకం ఏ వెధవకుంది? వెధవలకీ వెర్రి పీర్లకీ ఉంది. మంచీ చెడ్డా పాపం పుణ్యం అంటూ ఏం లేవురా సోదరా? నీకు మాత్రం తెలీదా ఏమిటి? తెలీకపోతే నిన్నూ పోలమ్మతో జమకట్టుకోవాలి. పోలమ్మని ఎరుగుదువుకదూ? అదీ నీలాగే అంటుంది."

"ఏమంటుంది?"

"పోలీసుల్లో పుణ్మాత్ములున్నా రంటుంది."

"బ్రాహ్మల్లోకూడా మహాత్ములుంటారన్నాడు గురజాడ...."

"వెటకారంగా అనుంటాడు."

"....అలాంటప్పుడు పోలీసుల్లో పుణ్యాత్మ లుండటానికేం?"....

"ఉండొచ్చుండొచ్చు. వెర్రివాళ్ళకి తప్పక ఉండొచ్చు. అయితే, పోలమ్మకున్న లాంటి వెర్రే నీకూ ఉందనీ నన్ను నమ్మమంటావు."

"పోలమ్మకి వెర్రుందో, లేదో నాకు తెలీదు" అన్నాడు వాడు.

"దానికి వెర్రికాదు; బుర్రలేదు, పోలమ్మని నీకు బాగా తెలుసుకదా?"

"అదెవరు!" అనడిగేడు తెలీనట్టు.

పోలమ్మని వాడికి బాగా తెలుసని నాకు తెలుసు. అందమైన ఆడవాళ్ళంటే వాడికి జాతిమత కులభేదాలు లేవు. వాడి లొసుగు నాకు బాగా తెలుసు.

"పోలమ్మెవరు?" అని పెద్దాయన అడిగేడు చుట్టముట్టిస్తూ.

"సారా అమ్ముతుంది" అని చెప్పేను.

"ఎవరో నాకు తెలీదు" అన్నాడు కరుణాకరం.

"అబద్ధాలాడ్డం నీకు బాగా తెలుస్సు. కిందటేడు వినాయక చవితినాడు సాయంకాలం...."

"పేరు నాకు జ్ఞాపకం లేదు."

"పోనీ, మనిషిని తెలుసుకదా?"

"తెలుసు. తెలిస్తే? ఏమొచ్చింది? అది నీకంటే మంచిదే" అన్నాడు కరుణాకరంగాడు దుఃఖం పట్టలేక. అని పెద్దాయనవైపు తిరిగి "మీకు తెలుసుకదండీ? ఆ మధ్య ఒక మేస్ట్రీటుండేవాడు. పేరడక్కండి, మీకూ తెలుసు. ఆయన థీరీ ఏమిటో తెలుసా? ఇంత చదువు చదువుకొని ఇంత వుద్యోగం చేస్తూ నేనే యింత యింత దొంగ వెధవని కదా? మరింక ఈ ముద్దాయీ వెధవలు కాక పోతారా? అని, అదీ అతగాడి థీరీ. అందువల్ల కోర్టుకొచ్చిన ముద్దాయి కల్లా అధమం ఆరేసి నెలలు గుచ్చేసేవాడు. మావాడి థీరీ కూడా అదే. తను దొంగ కాబట్టి నేను బందిపోటు దొంగనవాలి. నేను వెధవని కాబట్టి అది ముండయి తీరాలి. అదీ మావాడి థీరీ!" అన్నాడు.

వాడికి లోపల నా మీద అంత విషం వుంది.

"కోపం తెచ్చుకోకురా సోదరా! ఎందుకంత కోపం? నీచపు ముండతో సంబంధం వుంది కాదా అన్చెప్పి నిన్ను కూడా నీచపు వెధవ కింద జమకట్టడం లేదు" అన్నాను నేను.

"జమ కట్టుకో నాకేం భయం లేదు."

"భయమెందుకూ? సిగ్గుండాలి."

"సరే, నా కదీ లేదు. ఇంతకి పోలమ్మ ఏమన్న దన్నావు? సరీగా చెప్పు! ఏమన్నాది?"

"పోలీసుల్లో పుణ్యాత్ములున్నారన్నాది."

"ఎందుకుండకూడదు! మన లాయర్లలోనే ఉన్నారు కదా? వాళ్ళల్లో ఎందుకుండరూ? ఇంతకీ మీ నాన్న పెద్ద పోలీసాఫీసర్ గా పని చేస్తూనేకదా పోయాడు? మీనాన్న పుణ్యాత్ముడుకదా?" అన్నాడు కరుణాకరంగాడు.

వాడు పరసనాలిటీస్‌లోకి దిగుతాడని నాకు తెలుసు. వాడు బతికిన బతుక్కి నోటంట నీచపు మాటలు తప్ప మంచిమాటలెలా వస్తాయి?

"మానాన్న గురించి మీనాన్న గురించీ సంగతులు చెప్పుకోవాలంటే చాలా వున్నాయి" అన్నాను.

కొంచెం కసిగానే అన్నాను. వాడి తండ్రిని ఉద్యోగంలోంచి డిస్మిస్ చేసేరు. తరువాత ఆరు నెలలు జెయిలు వేసేరు. ఆ సంగతి ఊరందరికీ తెలుసు. జెయిలేస్తే 'నిరపరాధిని నిరపరాధిని' అంటూ నానాగోల చేసేట్ట. ఆఖరికి జెయిల్లోనే చచ్చీసేట్ట. నిరపరాధులం నిరపరాధులం అని అందరూ గోల చెయ్యొచ్చు. ఎవడు చెయ్యలేడు? అలా అయితే ప్రతీవాడూ నిరపరాధే, నేనూ నిరపరాధే! నాక్కూడా ఏ పాపమూ తెలీదు!

నేనలా అనేసరికి కరుణాకరంగాడి ముఖం కాల్చినట్టయిపోయింది. ఆపాటిదానికి నన్నెందుకూ అనడం?

"మాఫాదరు పాపం చేసేడో లేదో నాకు బాగా తెలుసు. నేనేం కాదనడంలేదు. పోలీసుల్లో పుణ్యాత్ముల్లేరని నువ్వే అంటున్నావు. అయితే మీ ఫాదరుకూడా పోలీసాఫీసరే! మీ ఫాదరు పుణ్యాత్ముడని నా నమ్మకం, నీకు ఆ నమ్మకం లేకపోవచ్చు నేమోగాని" అని తిరుగుబోతుగా జవాబిచ్చేడు వాడు.

దాంతో నాకు చిర్రెత్తుకొచ్చింది.

"పాపం పుణ్యం, మంచీ చెడ్డా అనేవి లేనే లేవంటున్నాను నేను. అదీ నా వాదన, ఆ సంగతి మర్చిపోతున్నావు నువ్వు. అంచేత మా ఫాదరు పాపాత్ముడూ కాడు, పుణ్యాత్ముడూకాడు. ఆయనా నీవంటి నా వంటిమనిషి, అంతే. మనుష్యుల్లో రెండు కళ్ళూ, రెండు చెవులూ ఉన్నట్టు మంచి చెడ్డా అంటూ రెండు లేవు. అలానూ లేవు మరోలానూ లేవు. ఈ మనిషి మంచివాడు అని నువ్వేమనిషిని చూపించినా నేను నమ్మను. లోకంలో యెవరి లాభంకోసం వాళ్ళు ప్రతిపనీ చేస్తారు. మాటొచ్చింది కాబట్టి చెప్తున్నాను. జరిగిన సంగతి వినండి గురువుగారూ!–

పోలమ్మే ఉంది. అది సారా వ్యాపారం చేసి సర్వనాశనం అయిపోయింది. అందుకు కారణం సగం తను. సగం పై వాళ్ళూను. ఎవణ్నిపడితే వాణ్నే నమ్మేస్తుందది. (ఆ అనువు మనవాడిక్కూడా బాగా తెలిసుండాలి) నా మట్టుకి నన్ను ఎంతగానో నమ్మిందది. ఫ్రాంక్‌గా చెప్తున్నాను–ఆ నమ్మకంవల్ల చాలాసార్లు ఒప్పుకున్నకంటే యెక్కువ ఫీజే దాన్దగ్గిర లాగ్గలిగేను. అందుచేత దాన్ని తెలివితక్కువ వెర్రి ముండనుకోమంటారా? కాదు, 'పాపం! చాలా మంచిది' అనుకోమంటారా? దాని లాభం దానికి తెలీదు. అందుచేత నష్టపోయింది. అంతే! నిన్న నేమిటయింది? నిన్న తెల్లవారు జామున దాన్ని నాలుగ్గేలన్ల సారాతో పోలీసులు పట్టుకున్నారు. పట్టుకుంటే అది 'బీదదాన్ని బాబుల్లారా! కనికరించండి కనికరించండ'ని వాళ్ళ కాళ్ళు పట్టేసుకుంది. అప్పుడు వాళ్ళేంచేసేరు? దొరికిన సారాని దాని చేతనే నలభై రూపాయలకి అమ్మించేరు. అమ్మించేసి, దాన్ని కనికరించినట్టుగా, ఒక సీసా సారామాత్రం దొరికినట్టుగా దమ్మిడికేసు పెట్టేరు. ఆ సారా అమ్మిన నలభై లోనూ ఇరవై రూపాయలు జరిమానా చెల్లించుకొని జెయిల్లేకుండా చేసుకొంది పోలమ్మ. ఆ సదుపాయం చేసి పెట్టినందుకు వాళ్ళని

'మారాజులు! ఎంత పుణ్యావో, అంత పుణ్యం ఆళ్ళకి. అంత మంచోళ్ళు ఈ రోజుల్లో ఒవులుంటారు బాబూ?' అంటుందది. అటువంటి వెర్రివెంగళప్ప అది" అని నేను, వస్తూన్న కోపాన్ని ఆపుకొంటూ తొందరగా బిగ్గరగా చెప్పేను.

పెద్దాయన, కోటు జేబులు రెండింట్లోను చేతులు పెట్టుకొని; నోట్లోచుట్ట నోట్లో ఉంచుకొనే పొగ బైటకి వదుల్తూ కొంచెం ఆలోచించి,

"ఏమండీ! దానిని చూసి కనికరించి, జెయిల్లేకుండా దాని కాపాటి సహాయం చేసేరుకదా! మరి దాని దృష్ట్యా వాళ్లు మంచివాళ్ళే కదా!" అన్నాడు.

అతనలా అంటాడా అనడా అని నేను చూస్తున్నాను.

"మంచితనమూ లేదు. గాడిద గుడ్డూ లేదు. వచ్చిన నలభై రూపాయల్లోనూ సగమే జరిమానా క్రింద చెల్లించింది పోలమ్మ. మిగతా సగం సొమ్మూ ఏమయిందను కున్నారు!" అడిగేను.

"ఏమయింది?" అన్నాడు పెద్దాయన.

"ఏమయిందా? జవాన్ల జేబుల్లోకి వెళ్ళింది, అదీ సంగతి. లాభం లేనిదే యెవడూ వేటకి వెళ్ళడు. నేను కరుణాకరంకూడా ప్రాక్టీసు చెయ్యడం యెందుకు? డబ్బు మూటకట్టుకోడానికేగాని, పుణ్యం మూటకట్టుకుందికి్కాదు. పోలీసువాళ్ళకి ఇరవై రూపాయలు లాభించింది. కాబట్టి వాళ్ళు దానికా సదుపాయం చేసేరు. అందులో వాళ్ళమంచేముంది?" అని పెద్దాయన్ని టకాయించేను.

పెద్దాయన ముఖం మాడ్చుకున్నాడు. మాక్లబ్బులో పేకాటలో ఓడిపోయిన వెధవలు అలాగే ముఖాలు పెట్టుక్కూర్చుంటారు. ముసలాడి మాడుముఖం చూస్తోంటే నాకు చెడ్డ నవ్వొచ్చింది. కాని అటువంటి సమయాల్లో మనం యెప్పుడూ పెద్దగా నవ్వకూడదు. నవ్వితే చాలా నష్టాలున్నాయి. అందుచేత చిన్న చిరునవ్వుమాత్రం కక్కి— "మంచీచెడ్డా పాపం పుణ్యం లేవు గురువుగారూ! లాభం నష్టం రెండేయున్నా యిప్పుడు" అని మాటలన్నిటినీ సున్నితంగా నొక్కుతూ చెప్పాను.

కరుణాకరంగాడు కొద్దిసేపు కొరకొర లాడుతూ నా వేపు చూసేడు.

"సిగరెట్టు కావాలా?" అని అడిగేను. నేనోగోల్డు ఫ్లేకు అంటిస్తూ!

"అక్కర్లేదు! థాంక్స్; కాని ఇప్పుడు నువ్వు చెప్పిన దాంట్లో నువ్వొకసంగతి చూడ్డం మరచిపోయేవు. మనుష్యుల మంచితనంమీద నీకైతే నమ్మకం లేకపోవచ్చు. అందుకు నేను బాధ్యుణ్నికాను. అది నీ దౌర్భాగ్యం. పోలీసులు మంచివాళ్ళుకారని చక్కగా నిరూపించేవు. బాగానే వుంది. కానీ, పోలీసుల్లో కూడా మంచితనం చూడగలిగిన పోలమ్మ మంచితనంమీద నాకు నమ్మకం వుంది. దాన్ని 'తెలివితక్కువముండ వెర్రి వెంగళప్ప' అన్నావు. ఇప్పటికి బాగానేవుంది. అలాంటివాళ్ళు లోకంలో కోటాను

కోట్లున్నారు. అందుకే నువ్వూ నేనూ మెరిగేస్తున్నాం. కాని యెల్లకాలం వాళ్ళు అలా వెంగళప్పల్లా వుండిపోరు. యెప్పుడో అప్పుడు, ఏదోరోజున వాళ్ళందరూ ఒక్కసారిగా గప్పున తెలివితెచ్చుకుంటారు. వాళ్ళు తెలివి తెచ్చుకుంటే, నువ్వూ నేనూ నీలాంటివాళ్ళం నాలాటివాళ్ళం అంతాకూడా జాగ్రత్తగా వుండాలి. ఏంచేత జాగ్రత్తగా వుండాలో తెలుసా? అప్పుడు పుణ్యం వర్ధిల్లుతుంది. అంచేత; అప్పుడు మన్లాటి పాపులం బహు జాగ్రత్తగా ఉండాలి!"

అంటూ విషాన్నంతా కక్కేసి, గబగబా వెళ్ళిపోయేడు కరుణాకరంగాడు.

చెడ్డ విషపు వెధవ! అలాటి పాపిష్టి విషపు వెధవలు నరకానికి వెళ్తారంటే నేను ఖచ్చితంగా నమ్ముతాను. ప్రస్తుతం నామీద దుష్ప్రచారం చేసీ దెబ్బతీయడానిక్కూడా తప్పక ప్రయత్నం చేస్తాడు. ఇలాంటి వెధవలు చెడుపూ చిల్లంగీ కూడా పెట్టేసినా పెట్టేస్తారు. కీడెంచి మేలెంచాలి. సాయంకాలం కోవెల్లో కెళ్ళి ఓ కొబ్బరికాయ కొట్టేస్తాను, లాభిస్తే లాభిస్తుంది. లేకపోతే లేదు. దేముడికో దండం పారేస్తే నష్టమేం లేదుకద.

విశాలాంధ్ర దినపత్రిక. 7-5-1961